క్లుప్తంగా

శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా శ్రీవారికి అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. నగరానికి చెందిన జ్యోతి కుటుంబ సభ్యులు శ్రీవారికి పట్టువస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

అమ్మో.. తేనెపట్టు



మారికవలస ఆర్‌జీకే కాలనీలో నివాసాల మధ్య తేనెపట్టు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎం రాజీవ్ గృహకల్ప కాలనీలో నివాసాల మధ్య పెద్ద తేనెపట్టు స్థానికులను కలవరపెడుతోంది. ఇక్కడి 148వ బ్లాకులో మెట్ల మార్గంలో నిండుగా పట్టిన తేనెపట్టు రోజురోజుకూ పరిమాణం పెరిగిపోతోంది. చిన్న గాలి వీచినా, చీకటి పడినా, పొరపాటున ఏదైనా తగిలినా పెద్ద పెద్ద తేనెటీగలు ఇళ్లలోకి చొరబడి దాడి చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనంతుని ఆలయాన్ని టీటీడీ దత్తత తీసుకోవాలి



అనంత పద్మనాభస్వామి ఆలయం గురించి వైవీ సుబ్బారెడ్డికి వివరిస్తున్న రాంబాబు

పద్మనాభం : పద్మనాభంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని టీటీడీ దత్తత తీసుకోవాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన రివ్యూ సమావేశంలో సుబ్బారెడ్డిని ఎంపీపీ కలిసి ఆలయ పరిస్థితి గురించి వివరించారు

ఎంఆర్‌పీకే ఎరువులు అమ్మాలి



రెడ్డిపల్లిలో ఎరువుల షాపును పరిశీలిస్తున్న అప్పలస్వామి

పద్మనాభం : ఎంఆర్‌పీకే ఎరువులు అమ్మాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో అనుమాలుశెట్టి వెంకటరావు ఎరువుల డిపోను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టాకు, స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం పొట్నూరు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి రైతు పండించే పంటను నమోదు చేసుకోవాలని వీఏఏను ఆదేశించారు. పద్మనాభం మండలంలోని 16 ఆర్‌బీకేల్లో యూరియా, డీఏపీ ఉన్నాయన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం ఉన్నారు.

పారదర్శక పాలనే సీఎం జగన్ ప్రత్యేకత

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- మారికవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మారికవలస ఆర్‌జీకే కాలనీలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : అవినీతి, పక్షపాతానికి చోటు లేని పారదర్శక పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకత అని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గతంలో చంద్రబాబు హామీలు అమలు చేయకుండా మోసం చేస్తే.. చెప్పిన ప్రతి మాటను చేసి చూపించిన నాయకుడు జగన్‌మోహనరెడ్డి అని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ 5వ వార్డు 78వ సచివాలయం, మారికవలస ఆర్‌జీకే పాత కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు నివాసాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరించారు. సంక్షేమ పథకాల కరపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కాలనీలో వివిధ రకాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రు. 5 కోట్లు వెచ్చించిందని, ఎంతో మందికి సంక్షేమ పథకాలు అందించిందని చెప్పారు. రాజకీయాలు, కులాలు, మతాలు, ప్రాంతాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కాలనీలో 76వ వార్డు సచివాలయం బస్ షెల్టర్ నిర్మాణం, తాగు నీటి పైపులైన్ ఏర్పాటు, దుర్గా టెంపుల్ వద్ద అవుట్‌డోర్ జిమ్ ఏర్పాటు, అంగన్‌వాడీ భవన నిర్మాణం, రైతు బజార్ మరమ్మతులు చేయిస్తామని, ఆకతాయిలు, మందుబాబులకు నిర్మానుష్య ప్రదేశాలు నిలయాలుగా మారాయని వీటిపై తక్షణ చర్యలు చేపడతామంటూ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, భీమిలి ఏఎంసీ డైరెక్టర్ జేఎస్ రెడ్డి, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎం పాత్రుడు, సచివాలయ కన్వీనర్లు ఎస్. రుషికేశ్వరరావు, వి. శ్రీనివాసరావు, కె. శంకరరావు, టి. ప్రసాదరావు, వివిధ విభాగాల నాయకులు ముచ్చు రామారావు, రాజాంనాయుడు, బోయి సుజాత, గాయిత్రి, డి. కావ్యరెడ్డి, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితాల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో ఓటర్ల జాబితాల పరిశీలన పకడ్బందీగా జరుగుతోందని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి జాబితాల్లో ఉన్న ఓటర్ల వివరాలు జాగ్రత్తగా పరిశీలన చేస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా సవరణలు ఉంటే వాటిని పరిష్కరించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లు తొలగిస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా ఇంకా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. సీపీఐ నాయకుడు కానూరి రాంబాబు మాట్లాడుతూ చిట్టివలస జ్యూట్‌మిల్లు క్వార్టర్స్‌లో ఉండే వారు చాలా మంది వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారని, ఆ ఓటర్ల జాబితాలను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు బోని బంగారునాయుడు, దొలుపల్లి ఏడుకొండలు, గంటా నూకరాజు, చంద్రరావు, కదిరి జగన్నాథం, కంటుభుక్త రామానాయుడు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు భాస్కరరావు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో ఆర్డీవో పర్యటన



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది ఎస్సీకాలనీలో ఆర్డీవో భాస్కర్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. సర్వే నంబర్ 159/5 లో ముప్పై ఏళ్ల నుంచి 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి ఇప్పటి వరకు పట్టాలు మంజూరు కాకపోవడంతో వారు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఆదేశాల మేరకు ఆర్డీవో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ సుమారు 1.05 ఎకరాల్లో 50 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీటిపై నివేదికను తయారు చేసి ఉన్నత అధికారులకు అందిస్తామని తెలిపారు.

జోరుగా పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



ఓ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

మధురవాడ : విశాఖ రూరల్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. మొదటి రోజు పలు పాఠశాలలు సందర్శించి 80 సభ్యత్వాలు నమోదు చేసినట్టు వారు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అంతా సభ్యత్వం తీసుకుంటున్నట్టు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథం, గోవిందరావు చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి. రాంబాబు, అమ్మిరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం



వెంకన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: వెంకటాద్రిపై శుక్రవారం వెంకన్న కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చాతుర్మాస పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



సంతపేటలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న భాస్కరరెడ్డి

తగరపువలస: తల్లీబిడ్డల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి అన్నారు. శుక్రవారం సంతపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, సీనియర్ నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల ఎల్లయ్యరెడ్డి, నీలాపు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- భీమిలి మండలం చిప్పాడ అంగన్‌వాడీ కేంద్రంలో టేక్ హోం రేషన్ కిట్లను సర్పంచ్ వెంపాడ రమావతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం అవగాహన కలిగించాలన్నారు. బిడ్డ జన్మించిన గంటలోపు ముర్రుపాలు తాగించడం ద్వారా అది వ్యాధి నిరోధక టీకాగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్ర,బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం పదిలం



అనంతవరంలో ఎస్సీ రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయడంపై మరింత ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని అనంతవరంలో పీఎంఏజేఏవై పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 168 మంది ఎస్సీ రైతులకు శత శాతం సబ్సిడీపై మంజూరైన నవ ధాన్యాల కిట్లను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. రాంబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆరగించడం వల్ల ఆరోగ్యకరంగా అంటారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గేదెల చంద్రరావు, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది శంకరరావు, భవాని, భాస్కర్ పాల్గొన్నారు.

- కొవ్వాడ సచివాలయంలో 27 మంది రైతులకు నవధాన్యాల కిట్లను సర్పంచ్ పొన్నకాయల రత్నం, ఎంపీటీసీ సభ్యురాలు బోని రమణమ్మ పంపిణీ చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ త్రివిక్రమవర్మ

ఎంవీపీ కాలనీ: నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ వర్మ శుక్రవారం ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఎంవీపీ పోలీసు స్టేషన్‌కు వచ్చినట్లు ఆయన రికార్డులను పరిశీలించారు. జనరల్ డైరీ, విధులపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో ఎంతమంది రౌడీ షీటర్లు ఉన్నారు.. వారిపై ఎలాంటి నిఘా అమలు అవుతుందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మీడియాతో మాట్లాడుతూ నగరంలో గత నాలుగు నెలలుగా క్రైమ్‌తో పాటు ట్రాఫిక్ ప్రమాదాలు తగ్గినట్లు వెల్లడించారు. రౌడీషీటర్లు, గంజాయి రవాణా నిందితులపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగినా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, సీఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రెండో వార్డు సమస్యలపై వినతి

తగరపువలస: కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన భీమిలి నియోజకవర్గ సమీక్షసమావేశంలో వైఎస్సార్‌సీపీ 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి ప్రధాన సమస్యలపై ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజినికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా వినతిపత్రం అందించారు. అందులో భాగంగా మామిడిపాలెంలో 20 ఏళ్లుగా స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నందున అక్కడ వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని కోరారు. 7 వేల మంది జనాభాకు వినియోగమయ్యే విధంగా సంతపేట రెడ్డివీధిలో కల్యాణ మండపం నిర్మించాలని కోరారు. అదే ప్రాంతంలో 300 మీటర్ల పొడవైన సీసీ రోడ్డు, ఆదర్శనగర్‌లో డ్రైనేజీ సమస్య, అయిదు చోట్ల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం గురించి వారి దృష్టికి తీసుకెళ్లినట్టు సరళారాణి తెలిపారు.

పైడయ్యరెడ్డికి పలువురు నివాళులు

తగరపువలస : ఇటీవల మరణించిన కాంగ్రెస్ కార్మిక సంఘం మాజీ వైస్ ప్రెసిడెంట్ జీరు పైడయ్యరెడ్డికి శుక్రవారం చిల్లపేటలోని ఆయన నివాస గృహంలో పలువురు నివాళులు అర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, దల్లి అప్పలరెడ్డి, సరగడ గోపీరెడ్డి, జీరు ఎర్రయ్యరెడ్డి ఉన్నారు.

జంధ్యాల పాపయ్యశాస్త్రికి నివాళి

తగరపువలస : కరుణ రస ప్రధానంగా కవితలు రాసి సుప్రసిద్ధులయిన జంధ్యాల పాపయ్యశాస్త్రి జయంతి సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ బంగ్మెట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆయనకు నివాళులు అర్పించారు. 20వ శతాబ్దంలో జనాదరణ పొందిన తెలుగు కవుల్లో కరుణశ్రీ శైలి సులభంగా ఉండేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం పొందారన్నారు. ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్, మల్లిక, నాగమణి పాల్గొన్నారు.

'విరాళాలు సేకరించడం లేదు'

కొమ్మాది: బీచ్ రోడ్డు నేత్ర విద్యాలయం నుంచి అంతర్జాతీయ మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో ముగ్గురు విద్యార్థినులు పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఈ నెల 20వ తేదీ నుంచి ఇంగ్లాండ్‌లో జరిగే ఇంటర్నేషనల్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ జరగనుంది. అయితే దీనిని ఆధారంగా తీసుకుని కొంత మంది స్ఫూర్తి ఫౌండేషన్ పేరుతో విజయనగరం జిల్లాలో పలు చోట్ల విరాళాలు సేకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని నేత్ర విద్యాలయం ప్రతినిధి పీఎస్ఎన్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. తాము ఎవరి వద్ద విరాళాలు సేకరించలేదని, ప్రజలు ఈ విషయం గమనించాలన్నారు.

మందులతో క్షయ వ్యాధికి చెక్



రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న వైద్యాధికారి గంగునాయుడు

ఆనందపురం : క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.గంగునాయుడు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గంగునాయుడు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి తొందరగా నయమవుతుందని చెప్పారు. రెండు వారాల పాటు దగ్గు, జ్వరంతో బాధ పడుతున్నవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి తనిఖీ చేసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే మందులను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఈ విషయంలో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, రోగులకు ఎప్పటికప్పుడు సలహాలు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా 14 మంది రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, సబ్ యూనిట్ అధికారి నూకరాజు, పర్యవేక్షకులు ఎస్.వి. రమణ, పి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

భీమునిపట్నం: జీవీఎంసీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఎకో వైజాగ్ కిడ్స్ ఆర్ట్స్ కాంటెస్ట్‌లో స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి, బహుమతులు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సింహాచలం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. ఈ కాంటెస్ట్‌లో 7 నుంచి 10వ తరగతికి చెందిన సీనియర్ విభాగంలో కె.రేవతి ప్రథమ, కె.నవదీప్ ద్వితీయ, కార్తిక్ తృతీయ స్థానాలను సాధించారు. అలాగే 1 నుంచి 6వ తరగతికి చెందిన జూనియర్ విభాగంలో కె.అశోక్‌కుమార్ ప్రథమ, జె.మోహిత్‌కుమార్ ద్వితీయ, మల్లికార్జున్ తృతీయ స్థానాలను పొందారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పోటీల్లో ఇక్కడి విద్యార్థులు పాల్గొని, గెలుపొందడం అభినందనీయమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా వివిధ పోటీల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అల్లాడి శ్రీనివాసరావు, సుజాతకుమారి, నయ్యిం, వెంకటరావు, రామకృష్ణ, లక్ష్మి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ



ముందు భాగం నుజ్జయిన కారు



డివైడర్ పైకి ఎక్కిన కారు

కొమ్మాది : రుషికొండ బీచ్‌రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ మేరకు రుషికొండ నుండి దూసుకు వస్తున్న ఓ కారు ఇస్కాన్ టెంపుల్ వద్ద యు టర్న్ తీసుకుంటున్న మరో కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ కారు నుజ్జునుజ్జు కాగా మరో కారు డివైడర్‌ను ఢీకొట్టి పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విత్తన తయారీకి ఫౌండేషన్ సీడ్ పంపిణీ



మాట్లాడుతున్న ఏడీఏ సుబ్రహ్మణ్యం

ఆనందపురం : రైతులకు స్థానికంగా విత్తన కొరత తీర్చడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ చదువులు సుబ్రహ్మణ్యం చెప్పారు. మండలంలోని బోనిలో శుక్రవారం గ్రామీణ విత్తన ఉత్పత్తిపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఎకరాలకు అవసరమయ్యే ఎంటీయూ1121 రకం విత్తనాలను 50 శాతం రాయతీతో రైతులకు అందించామని వివరించారు. పంటకోత అనంతరం ఆయా రైతుల వద్ద వాటిని విత్తనాలు కింద సేకరించి స్థానిక రైతులకు అందజేస్తామన్నారు. అందువలన రైతులు 25 ఎకరాల పంటను జాగ్రత్తగా పండించాలన్నారు. దీని వలన విత్తన కొరత తీరుతుందని చెప్పారు. అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు అందజేస్తారని తెలిపారు. భీమిలి ఏడీఏ బి.విజయ్‌ప్రసాద్ మాట్లాడుతూ వరి పంటలో యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ గురించి వివరించారు. వ్యవసాయ డ్రోన్లు, నానో యూరియా ఉపయోగం వాటి వినియోగం గురించి రైతులకు వివరించారు. వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ మాట్లాడుతూ పొలం బడిలో భాగంగా రైతులు ఇ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సురేష్, వీఏఏ దిలీప్, రైతులు పాల్గొన్నారు.

వారంలో ఒకరోజు డ్రైడే పాటిద్దాం



అవగాహన కల్పిస్తున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము



బీటూ కాలనీలోని ఓ ఇంటి వద్ద డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొమ్మాది: వారంలో ఒక రోజు, ప్రతీ శుక్రవారం డ్రై డే పాటిద్దామని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పిలుపునిచ్చారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో గురువారం ఆయన పర్యటించారు. ముందుగా వార్డులో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు డ్రైడే పాటించడం వలన మురుగు నీరు, నిల్వ నీరు పోతుందని, అదేవిధంగా దోమలను నివారించవచ్చని చెప్పారు. పూలకుండీల్లో, పాత టైర్లలో, ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

6వ వార్డులో..

పీఎం పాలెం: పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల వ్యాప్తికి చెక్ పెట్టవచ్చని పీఎం పాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుజైన్ అన్నారు. ఫ్రై డే - డ్రై డే కార్యక్రమంలో భాగంగా 6వ వార్డులోని బీటూ కాలనీలో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది పర్యటించారు. ఇళ్ల వద్ద, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. ఇళ్ల ముంగిట ఉన్న డ్రమ్ములను పరిశీలించి, వాటిని తొలగించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.